




**జానే చలే జాతే హై కహా?**

**దునియా సె జానే వాలే, జానే చలే జాతే హై కహా**

**కైసే ఢూంఢే కోయీ ఉన్‌కో, నహీ కద్మోంకే భీ నిషాన్!**

ఆలోచిస్తూంటే బుర్ర వేడెక్కిపోతుంది. మనసు విషాదమయం అవుతుంది. హృదయం బరువెక్కుతుంది. మెదడు అయోమయమయం అవుతుంది. మరణించిన వారు ఏమౌతారు? వారు ఎటు వెళ్తారు? ఇన్నాళ్లూ తాము నివసిస్తున్న గూడులాంటి శరీరాల్ని ఒంటరిగా, నిస్సహాయంగా, నిర్జీవంగా వదిలి ఎటు వెళ్తారు? తాము ప్రేమించిన వారిని, తమని ప్రేమించిన వారిని, తమపై ఆధారపడినవారిని, తమ ఆశలను, అనుభవాలను, ఆకాంక్షలను, ఆవేశాలను అన్నిటినీ వదిలి అలా ఎలా వెళ్తారు? ఎటు వెళ్తారు?

ఒకో మరణవార్త విన్నప్పుడల్లా పలు ఆలోచనలు ముసురుకుంటాయి. కొన్ని మరణాలు ఊహకు అందుతాయి. వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూంటాడు. అతని రోజులు దగ్గరపడ్డాయని తెలుస్తూంటుంది. మరొకరు పండుటాకులా ఉంటారు. ఇవాళ్లో, రేపో అని తెలుస్తూంటుంది. కొందరి బాధ చూస్తూంటే మరణం వారికి విశ్రాంతి నిస్తుందనిపిస్తుంది. కానీ కొన్ని మరణాలు హఠాత్తుగా సంభవిస్తాయి. అనూహ్యంగా సంభవిస్తాయి. అప్పటిదాకా నవ్వుతూ తుళ్ళుతూంటాడు. భవిష్యత్తు గురించి బోలెడన్ని ప్రణాలికలు వేస్తాడు. 'రేపు కలుస్తానని' వెళ్తాడు. తెల్లారే కబురువస్తుంది. హఠాత్తుగా గుండెపోటుతో మరణించాడని. దారిలో రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడని. నవ్వుతూ నవ్వుతూ పడిపోయి లేవలేదని. మరణం అన్నది ఎప్పుడయినా చెప్పిరాదు. హఠాత్తుగానే వస్తుంది. కానీ ఇలా ఇంకా ఎంతో భవిష్యత్తున్నవారు, ఎంతో ఎత్తులకు ఎదగాల్సిన వారు, ఎంతెంతో సాధిస్తారనుకున్న వారు హఠాత్తుగా అదృశ్యమైపోతే, అప్పుడు వస్తుందీ ప్రశ్న. ఏమిటీ జీవితం? ఎందుకనీ జీవితం? ఏం సాధించేందుకు ఈ జీవితం? ఎవరు మాత్రం ఏం సాధిస్తారు? అసలు ఎటు వెళ్తారు మరణించినవారు? మంచి వెతకలేం మనం. వారిని వెతకలేం మనం. ఎక్కడని వెతుకుతాం? వారు ఎటు వెళ్తారో కాలి గుర్తులుండవు. అయినా వాళ్లు ఎలా వెళ్తారు? శరీరం ఇక్కడే ఉంటుంది. శరీరంలోని ఆ చైతన్యం ఎటు వెళ్తుంది? ఏమైపోతుంది?

ఓ జానేవాలే హో సకేతో లౌట్ కె ఆనా

యే ఘాట్, తూ యే బాట్ కహీ భూల్ నజానా

ఓ జానెవాలే అంటే వదలి వెళ్లిపోతున్నవాడు. వీలయితే వెనక్కి తిరిగిరా. ఈ ప్రాంతం, ఈ దారులను మరచిపోవద్దు. 'బందినీ' సినిమాలో ఈ పాట ఓ గంభీరమైన సన్నివేశంలో వస్తుంది. నాయిక నాయకుడు ప్రేమిచుకుంటారు. త్వరలో వస్తానని నాయకుడు వెళ్తాడు. వెళ్లినవాడు రాడు. నాయిక గురించి ఊళ్లో వాళ్లంతా చెవులు కొరుక్కుంటూంటారు. దాంతో ఆమె ఊరు వదిలి వెళ్తుంది. ఆమె ఊరు వదిలి వెళ్లే సందర్భంలో వస్తుందీ పాట. మామూలు గేయ రచయితలు ఇలాంటి సందర్భంలో , 'నీ గమ్యం అగమ్యగోచరం' అనో 'నీ భవిష్యత్తు ప్రహేళిక' అనో, 'నమ్మి మోసపోయావమ్మా' అనో, 'ప్రేమ ముళ్ల కిరీటం' అంటూ సందర్భోచితంగా పాటను రచిస్తారు. కానీ శైలేంద్ర సామాన్య గేయ రచయిత కాదు. పాటను సందర్భ పరిధిలో ఒదిగిస్తూనే, భావానికి సార్వజనీనతను ఆపాదిస్తాడు. సినీ సందర్భంలో చూస్తే ఇల్లువాకిలి అనిశ్చితమైన భవిష్యత్తు వైపు ప్రయాణిస్తున్న అమాయకురాలి గురించిన పాట అనిపిస్తుంది. సినీ సందర్భ పరిధి దాటి చూస్తే, ఈ ప్రపంచం వదలి అందని, తెలియని లోకానికి వెళ్తున్న సన్నిహితుడి గురించి ఆవేదనతో చేస్తున్న ఆక్రందన అనిపిస్తుంది.

**బచ్‌పన్ కె తెరే మీత్, తెరే సంగ్ కే సహారే**
**ఢూంఢేంగె తుఝే గలీ గలీ, సబ్ యె గం కె మారే,**
**పూఛేగి హర్ నిగాహ, కల్ తెరా ఠికానా.**

బాల్యంలో నీతో ఆడుకున్నవారు, నీతో కలసి తిరిగినవారు నీకోసం అణువణువూ వెతుకుతున్నారు. నువ్వు దూరమైన బాధ వారిని వేధిస్తోంది. ప్రతి నయనం, నువ్వెక్కడ అని అడుగుతుంది. ఇది ఊళ్లో వాళ్ల గురించి సినీ సందర్భంలో. సన్నిహితుడిని కోల్పోయిన వాళ్ళ హృదయవేదన సందర్భ పరిధి దాటి.

**దే దే కె యె ఆవాజ్ కొయీ హర్ ఘడీ బులాయే**
**ఫిర్ జాయె జో ఉస్‌పార్ కభీ లౌట్ కే న ఆయే**
**హై భేద్ యె కైసా కొయి కుఛ్ తో బతానా!**

నిన్ను ప్రతిక్షణం గొంతు విప్పి పిలుస్తూంటాం. ఆ వైపు వెళ్లినవారు తిరిగి వెనక్కి రారని అందరూ అంటూంటారు. ఈ రహస్యం ఏమిటో ఎవరైనా కాస్త వివరించండి. అద్భుతం, ఎంతటి ఆవేదనకైనా కరిగించి వేయగల శక్తివంతమైన

భావం. ఒక నిస్సహాయస్థితిలో ఇలాంటి పాటలు ఇచ్చే సాంత్వనను వర్ణించలేము. వెలకట్టలేము. ముకేష్ స్వరంలోని విషాదం గుండెలోతుల్లోంచి వేదన ఉబికి ఉబికి వచ్చేట్టు చేస్తుంది. ఎస్డీ బర్మన్ సందర్భోచితమైన బాణీ, మనస్సు లోతుల్లో స్థిరపడి ప్రతిధ్వనిస్తూ ఆవేదనను అణచివేస్తుంది. అవును. ఆ వైపు వెళ్లిన వారు ఎవ్వరూ తిరిగిరారు. ఎందుకని? మనం వాళ్లని వెతకలేము. ఎందుకంటే వారు వెళ్లిన దారి తెలియదు. దారి చిహ్నాలు కూడా ఉండవు.

**జానే హై వో కౌన్ నగరియా, ఆయె జాయే ఖత్ న ఖబరియా,**
**ఆయే జబ్ జబ్ ఉన్ కీ యాదే, ఆయే హోఁఠోంపర్ ఫర్యాదే**
**జాకే ఫిర్ న ఆనే వాలే, జానే చలీ జాతే హై కహా?**

ఆ నగరం ఎలాంటిదో! అక్కడ నుండి ఎలాంటి వార్తలు రావు. ఉత్తరాలు రావు. కానీ అలా వెళ్లిపోయిన వారి జ్ఞాపకాలు వచ్చినప్పుడల్లా బాధతో మనసు పాడవుతుంది. పెదవులపై వేదనాభరితమైన పిలుపు నిలుస్తుంది. అలా వెళ్లి తిరిగిరాని వాళ్లు ఎటు వెళ్లిపోతారో? పదాలు, భావం చాలా సరళంగా సులభం అనిపిస్తాయి. కానీ ఆలోచిస్తున్న కొద్దీ భావం మనసులో ఇంకుతుంది. నిజమే కదా, వాల్లు వెళ్లేది నగరం ఏమిటో? వెళ్లిన వాళ్ల నుంచి సమాచారం రాదు. వాళ్లకు సంబంధించిన సమాచారమూ రాదు. అనుబంధాలు, ఆప్యాయతలు, ఆశలు, నిరాశలు అన్నమాట కట్టుకుని ఏ తిరిగిరాని లోకాలకు వెళ్తారో కదా!

**యే బిర్హాకీ రాత్ హై ఐసీ, జీ న మానే బాత్ హై ఐసీ**
**కల్ ఉన్‌కో దేఖా ముస్కాతే, చల్తే, ఫిర్తే, ఆతే జాతే**
**ఐసె ఆనే జానే వాలే, జానే చలే జాతే హై కహా!**

అలా నిన్నమొన్నటిదాకా మనతో నవ్వుతూ, తుళ్లుతూన్న వారు కళ్లు మూసి తెరిచేలోగా తిరిగిరాని లోకాలకు మనల్ని విడిచి వెళ్లారని నమ్మకం కుదరదు. నమ్మేందుకు మనస్సు ఇష్టపడదు. ఒప్పుకోదు. రాత్రిళ్లు ఒంటరిగా ఉన్నప్పుడు వారితో మన అనుబంధం గుర్తుకు వస్తుంది. బాధ వెల్లువవుతుంది. నిన్ననేకదా నవ్వుతూ చూశాం అతడిని. నవ్వుతూ, తుళ్లుతూ, వస్తూ, పోతూ చూశాం. అలాంటివాడు ఎటు వెళ్లిపోయాడు. అసలు ఎటు వెళ్తారు మరణించినవారు? 'మరుజన్మ ఉన్నదో లేదో, ఈ మమతలు అప్పుడు ఏమౌతాయో?' అనిపిస్తుంది. నిజం, అసలు ఎందుకీ బాధలు, వేదనలు, ప్రేమలు ఆరాటాలు, పోరాటాలు... క్షణంలో ఆవిరైపోయే జీవితంలో అనిపిస్తుంది.

**మేరే బిఛడే జీవన్ సాథి సాథి జైసే దీపక్ బాతి**
**మార్ఝ సే బిఛడ్ గయే తుం ఐసే, సావన్ కే జాతే హి జైసే**
**ఉడ్‌కె బాదల్ కాలే కాలే, జానే చలే జాతేహై కహా?**

జీవిత ప్రయాణంలో వెంట ఉండేవారు, వత్తి- వెలుతురులా వెన్నంటి ఉండేవారు హఠాత్తుగా వదిలి ఎటు వెళ్లిపోతారు? నల్లటి మేఘాలు ఆకాశంలో ఎటో వెళ్లిపోయేట్టు ఎటు వెళ్లిపోతారు?

'పుష్పాంజలి' సినిమాలో లక్ష్మీకాంత్ ప్యారేలాల్ సంగీత దర్శకత్వంలో ఆనంద్‌బక్షీ రాసిన ఈ పాటను ముకేష్ హృదయంతో పాడేడు. మనిషికి జీవితం ఒక ప్రవల్హిక అయితే మరణం ఒక ప్రహేళిక. తరచి చూస్తే మనిషి ఆడే జీవితమనే నాటకం, స్క్రిప్టు ఏమిటో తెలియకుండా ఆడే ఒక గుడ్డి నాటకం అనిపిస్తుంది. ఈ జీవిత ప్రయాణం ఒక గుడ్డివాడి ప్రయాణం అనిపిస్తుంది.

**యె జీవన్ సఫర్ ఏక్ అంధా సఫర్ హై**
**బహేక్ నా హై ముంకిన్ , భటక్ నేక డర్ హై**
**సంభల్‌తా నహీ దిల్, కిసీ కె సంభాలే**
**కహా జారహో హై తూ ఏయ్ జానె వాలె**

'సీమ' సినిమాలో శైలేంద్ర రాసిన పాట. శంకర్ జై కిషన్ సంగీత దర్శకత్వంలో రఫీ అత్యద్భుతంగా పాడాడు. ఈ జీవిత ప్రయాణం ఒక గుడ్డి ప్రయాణం లాంటిది. దారి తప్పటం అనివార్యం. జారిపడటం అనివార్యం. ఎవరెంతగా నియంత్రించాలని ప్రయత్నించినా హృదయం మాట వినదు. నియంత్రణలోకి రాదు. ప్రయాణిస్తూనే ఉంటుంది. ఎటు ప్రయాణం అన్నది తెలియదు.

నిజం . ఒక్క క్షణం ముందు ఏమవుతుందో తెలియదు. ఒక్క క్షణం తరువాత ఏమవుతుందో తెలియదు. ఎటు వెళ్తున్నామో తెలియదు. మనం చేస్తున్న పనుల ఫలితం తెలియదు. పరిణామం తెలియదు. కానీ ప్రయాణిస్తూనే ఉంటాం. ఎన్ని ఆశలతో, ఊహలతో ఎప్పుడు అంతమౌతుందో తెలియని, గమ్యం ఏమిటో తెలియని ప్రయాణంలో సాగిపోతూనే ఉంటాం.

**జిందగీ కా సఫర్, హై, యె కైసా సఫర్**
**కోయి సంఝూ నహీ, కోయీ జానా నహీ**
**హై యె కైసీ డగర్, చలే పడే సబ్ మగర్**
**కోయి సంఝూ నహీ, కోయి జానా నహీ.**

'ఇందీవర్' రాసిన ఈ ఆలోచనాత్మకమైన గేయం 'సఫర్' సినిమాలోది. కళ్యాణ్‌జీ ఆనంద్‌జీ సంగీత సృజనకు ప్రాణం పోసిన స్వరం కిషోర్ కుమార్‌ది. అందరి మనస్సుల్లో మెదిలే సందేహాలకీ అందమైన గీతం రూపం ఇది. ఈ జీవిత ప్రయాణం ఎంతో విచిత్రమైనది. ఎవరికీ అర్థం కాదు. ఎవరికీ తెలియదు. కానీ ఈ బాటలో అందరం నడుస్తూనే ఉన్నాం. ఎవరికీ అవగాహన లేదు. ఎవరికీ దీని గురించిన జ్ఞానం లేదు.

'సఫర్' సినిమాలో నాయకుడికి తనకు 'కేన్సర్' అని తెలుసు. త్వరలో పోతాడనీ తెలుసు. ఆ నిరాశా నిస్పృహల్లోంచి వెలువడిన ప్రశ్నలివి.

**జిందగీ కో బహుత్ ప్యార్ హం నే దియా**
**మౌత్ సే భీ మొహబ్బత్ నిభాయేంగె హం**
**రోతె రోతే జమానే మె ఆయే మగర్,**
**హసై హస్తే జమానే సె జాయేంగె హం**
**జాయేంగే పర్ కిధర్, హై కిసే యే ఖబర్**
**కోయి సం జా నహీ, కోయి జానా నహీ.**

జీవితాన్ని ఎలా ప్రేమించామో, మరణాన్ని కూడా అలాగే స్వీకరించాలి. మరణాన్ని చూసి భయపడకూడదు. అది అనివార్యం. మరణం సత్యం. జీవితం మిథ్య అంటుంది తత్త్వం. ఈ ప్రపంచంలోకి ఏడుస్తూ వస్తాం. నవ్వుతూ పోవాలి. 'తాకి హస్తే హువే నిక్ లె దం' నవ్వుతూ ప్రాణాలు విడవాలని కోరిక అంటాడు భరత్ వ్యాస్ 'ఏయే మాలిక్ తెరె బందే హం' పాటలో. అయితే, ఎటు వెళ్తాం? ఈ విషయం ఎవరికీ తెలియదు. ఎవరికీ అర్థం కాదు.

**ఐసే జీవన్ భి హై, జో జియే హీ నహీ**
**జిన్‌కో జీనేసే పహెలే హి మౌత్ ఆ గయీ**
**ఫూల్ ఐసే భి హై జో ఖిలే హీ నహీ**
**జిన్‌కో ఖిల్‌నే సే పహెలే ఫిజా ఖా గయీ**
**హై పరేషాన్ నజర్, థక్ గయే చారాగర్**
**కోయి సంఝా నహీ, కోయి జానా నహీ**

ఈ ప్రపంచం ఎంతో చిత్రమైనది. కొన్ని జీవితాలు జీవించటం ఆరంభించే ముందే అంతం అయిపోతాయి. కొన్ని పూలు పూసేముందే నశిస్తాయి. ప్రతి ఒక్కరి కళ్ళల్లో అయోమయం, ఆందోళనలు కనిపిస్తున్నాయి. వైద్యుడు, చికిత్సకుడు కూడా అలసిపోయాడు. అదే చికిత్స చేస్తే ఒకరు బ్రతుకుతారు. మరొకరు ప్రాణాలు కోల్పోతారు. ఎవరికెలా

నయమయిందో, ఇంకొకరికి ఎందుకు నయం కాలేదో ఎవరూ చెప్పలేరు. కానీ, ప్రతివారూ వెళ్ళిపోతారు. అక్కడెవరున్నారో తెలియదు కానీ ఎవరి మాటా వినకుండా, వొద్దన్నా ఆగకుండా, ఇంకాసేపుండమన్నా పట్టించుకోకుండా, ఏదో పొందేట్టు ఆ వైపు పరుగెత్తుతారు.

**వహా కౌన్ హై తెరా ముసాఫిర్, జాయేగా కహా?**

**దం లేలే ఘడీ భర్, యే ఛాయా పాయేగా కహా!**

సినీ సందర్భ పరిధిలో వొదుగుతూ పాటలోని భావాలకు సార్వజనీనతను ఆపాదించటం శైలేంద్రకు వెన్నతో పెట్టిన విద్య. 'గైడ్' సినిమాలో ఎస్డీ బర్మన్ స్వీయ సంగీత దర్శకత్వంలో పాడిన ఈ పాటను శైలేంద్ర ఒక తాత్త్విక గేయం స్థాయిలో రచించాడు. జైలు నుంచి విడుదలయి వచ్చిన వాడు తన పాత జీవితం వైపు వెళ్లాలా, తెలియని కొత్త జీవితం వైపు నడవాలా అన్న సందిగ్ధంలో ఉన్నప్పుడు నేపథ్యంలో వస్తుందీ పాట. అక్కడ ఎవరున్నారు? ఎటు వెళ్తావు? ఇక్కడ ఈ నీడలో విశ్రాంతి తీసుకో, మళ్లీ ఈ నీడ నీకు ఎక్కడ దొరుకుతుంది? తరచి చూస్తే అనంతమైన భావాలు ముసురుకుంటాయి.

**కహతే హై జ్ఞానీ, దునియా హై ఫానీ**
**పానీ పె లిఖీ లిఖాయీ**
**హై సబ్ కి దేఖీ , హై సబ్ కి జానీ**
**హాథ్ కిసీకే న ఆయీ**
**కుఛ్ తేరా న మేరా**
**ముసాఫిర్ జాయేగా కహా!**

అద్భుతం. జ్ఞానులు ఈ ప్రపంచం మిధ్య అంటారు. నీటిపై రాతలు అంటారు. అందరూ చూశారు. అందరికీ తెలుసు. కానీ ఎవరికీ ఏమీ తెలియదు. ఈ ప్రపంచం ఎవరి నియంత్రణకూ లొంగదు. ఇందులో ఏదీ నీదికాదు. నాది కాదు. ఎక్కడికి వెళ్తావు. ఇక్కడ నీడలో సేద తీరు. అతి గొప్ప జీవిత సత్యాన్ని అతి సరళంగా, సుందరంగా, అందరికీ అర్ధమయ్యే రీతిలో వ్యక్తపరచాడు శైలేంద్ర. కానీ ఇలాంటి ఎందుకో, ఏమిటో తెలియని ప్రపంచంలో, ఎందుకో, ఏమిటో తెలియకుండా జీవిస్తూ, ఎటు వెళ్తామో, ఏం సాధిస్తున్నామో అర్ధంకాకుండా ప్రయాణిస్తూన్న వారికి ఇలాంటి ప్రశ్నల పాటలు సాంత్వననిస్తాయి. జీవితం పట్ల ఆశను కలిగిస్తాయి. దుర్భర విషాదంలోనూ ఆనందాన్ని అనుభవించగల శక్తినిస్తాయి.

**జగమే మాయ, బ్రతుకే మాయ**

**వేదాలలో సార మింతేనయా**

అని 'దేవదాసు 'అన్నప్పుడు విషాదంతో కలగలసిన ఆనంద భావన మనసులో మెరుస్తుంది.

**కలిమి లేములు కష్ట సుఖాలు**

**కావడిలో కుండలనీ భయమేలోయి**

**బాధే సౌఖ్యమనే భావన రానీవోయి**

**ఆ యెరుకే నిశ్చలానందమోయ్, బ్రహ్మానందమోయ్.**

ఎందుకు జన్మించామో తెలియదు. జన్మించాం. ఇక సంసారంలో కష్టాలని భయపడాల్సిన పనిలేదు. సంసారమనే కావడిని భుజానికి ఎత్తుకున్న తరువాత దాన్లోని కుండల బరువు గురించి ఆలోచించాల్సిన పనిలేదు. బాధే సౌఖ్యమనుకుంటే ఇక అంతా ఆనందమే. మన సినీ కవులు అతి గొప్ప భావనలను తమ గీతాలలో పొందు పరచి అందించారు. వాటిని విని అర్ధం చేసుకుంటే కలిగే ఆనందానికి తిరుగులేదు. మన మనస్సుల్లోని ప్రశ్నలను వారు అడిగి మన సందేహాలకు సమాధానాలిచ్చారు.

**దునియా బనానే వాలే క్యా తేరె మన్ మే సమాయీ**

**కాహె తూ దునియా బనాయీ..**

'హస్రజ్ జైపురి ' 'తీస్రీ కసం' సినిమా కోసం రాసిన ఈ పాటను శంకర్ జై కిషన్ అద్భుతమైన పాటగా ముకేష్ స్వరంలో రూపొందించారు. ఈ ప్రపంచాన్ని సృజించిన వాడినీ ప్రశ్నిస్తున్నాడు. ఎందుకీ ప్రపంచాన్ని, ఏమాలోచించి సృజించావు?' అని. అయితే శైలేంద్ర 'బంద్‌నీ' సినిమాలో ఒక ప్రేమగీతాన్ని సందర్భ పరిధిలో ఒదిగిస్తూ సార్వజనతను ఆపాదించి మురిపిస్తాడు.

**మెరె సాజక్ హై ఉస్ పార్, మై మన్ మార్, తూ ఇస్ పార్**

**ఓ మెరె మాఝీ అబ్‌కే బార్ , లేచలో పార్, లేచలో పార్**

**మెరె సాజన్ హై ఉస్ పార్.**

నాయకుడు పడవలో వెళ్లిపోవాలి. నాయిక అతనితో వెళ్లాలో, వద్దో నిర్ణయించుకోవాలి. అప్పుడీ భటియాలీ (పడవవారు పాడే పాట) రీతిలో ఎస్డీ బర్మన్ స్వీయ సంగీత దర్శకత్వంలో పాడ్తాడు. నా ప్రియుడు ఆ వైపు ఉన్నాడు. ఈ వైపు మనస్సును చంపుకుని నేనున్నాను. ఓ నావికుడా ఈసారి నన్ను ఆ వైపు తీసుకువెళ్లు. ఇదీ పాట. తత్వం ప్రకారం మనమంతా విశ్వాత్మలో భాగం. మన ప్రేమ భగవంతుడిపై ప్రేమ. మనిషికి ప్రియుడు భగవంతుడు. భగవంతుడు ఆ వైపు

ఉన్నాడు. మనమంతా ఈ వైపు ఉన్నాం. అదీ మన బాధ. ఆ వైపు వెళ్లి ప్రియుడితో కలవాలి. ఇదీ ఆకాంక్ష. ఇదీ మరణం. మరణం అంటే ప్రియుడితో సమాగం.

**జిందగీ తో బేవఫా హై, ఏక్ దిన్ ఠుక్ రాయెగీ**

**మౌత్ మహబూబాహై, అప్నే సాథ్ లేకర్ జాయెగీ..**

'అంజాన్' రాసిన ఈ పరమాద్భుతమైన గీతం 'ముఖద్దర్ కా సికిందర్' అనే సినిమాలో కళ్యాణ్‌జీ ఆనంద్‌జీ సంగీత దర్శకత్వంలో కిషోర్ కుమార్ పాడిన 'రోతే హువే ఆత్ హై సబ్' పాటలోని ఓ చరణంలోని పాదాలు. జీవితం మోసగత్తె. మనల్ని కాదని వదిలి వెళ్లిపోతుంది. మృత్యువు మన ప్రేయసి. వెంట తీసుకువెళ్తుంది. వింటూంటేనే ఆనందంతో కూడిన సాంత్వననిచ్చే భావం. ఇలాంటి అత్యద్భుతమైన భావాలతో నిత్య జీవితంలోని సందేహాల లోంచి ఆనందకరమైన భావనలను మన సినీగేయ రచయితలు పిండి మనకు అందించారు. జీవితమంటే ఏమిటన్న ప్రశ్న ఉదయించినప్పుడు, మన సన్నిహితుల హఠాన్మరణం నిరాశను, నిర్వేదాన్ని రగిలించినప్పుడు ఇలాంటి పాటలు సాంత్వన నిస్తాయి. స్నేహితులకన్నా అధికంగా ఓదారుస్తాయి. సన్నిహితులకన్నా సన్నిహితంగా ధైర్యాన్నిస్తాయి. అయితే ఈ పాటలన్నిటి భావాలనూ తనలో పొదుగుకుని ఎలాంటి ఓదార్పు, అనునయాలు, బుజ్జగించుడు లేకుండా సత్యాన్ని కుండబద్దలు కొట్టినట్టు సూటిగా చెప్తూ, భగవద్గీత సారాన్ని స్ఫూర్తివంతంగా, జ్ఞానం ప్రసాదించేట్టు ప్రదర్శిస్తుందీ శ్రీకృష్ణావతారంలోని సముద్రాల రాఘవాచార్య రచన.. ఘంటసాల స్వరం హృదయాన్ని స్పందింపచేసి, భగవంతుడే మనకోసం ఈ దివ్య జ్ఞానాన్ని మనమీద ప్రేమతో, అపార కరుణ రసస్పృష్టి కురిపించినట్టు అందిస్తున్నాడన్న భావన కలిగిస్తుంది.

**తనువుతో కలుగు బాంధవ్యములెల్ల**

**తనువుతో నశియించి ధరణిలో కలియున్**

**తనువనిత్యమ్ము, నిత్యమ్ము ఆత్మయొకటే**

**చిరిగి జీర్ణములైన చేలముల్ వదలి**

**కొత్త వలువలు గట్టు కొన్నట్టి రీతి**

**కర్మాను గతికి ఒక్క కాయమ్ము వదలి**

**వేరొక్క తనువు ప్రవేశించునాత్మ.**

**ఆత్మకు ఆదియూ, అంతమ్ములేదు.**

**అది గాలికెండదు, అమ్ముతో తెగదు,**

**నీట నానదు, అగ్ని నీరైపోదు**

**కరుణా విషాదాల కలగించునట్టి**

**అహమును, మమకారమావలనెట్టి**

**మోహమ్ము వీడి, ప్రబుద్ధుడవగుమా**

అంటే, మనం శరీరం అదృశ్యం అయిందని బాధపడుతున్నాం కానీ శరీరంలోని చైతన్యం ఎటూ పోలేదు, ఈ రూపం నుంచి మరో రూపంలోకి మారుతున్నదంతే. నీరు గడ్డ కటి మంచు అయి, కరిగి నీరై, ఆవిరై మేఘమై, మళ్లీ జలం రూపంలో భూమిని చేరినట్టు రూపాలు రతాయి కానీ చైతన్యం ఒక్కటే. ఇది అర్థం చేసుకుంటే ఎంతో హాయి కలుగుతుంది. నశ్వరమైన శరీరంలో ఒదిగిన శాశ్వతత్వం గ్రహింపుకు వస్తుంది. శక్తి నిత్యత్వ సూత్రం ప్రకారం కూడా, శక్తి ఒక రూపం నుంచి మరో రూపానికి మారుతుంది. అంతే తప్ప శక్తి అదృశ్యమైపోవటం, తగ్గటం, పెరగటం అంటూలేదు. అది భ్రమ. శక్తి, వెలుగు రూపం ధరించవచ్చు. శబ్ద రూపం ధరించవచ్చు. వేగం రూపంగా మారవచ్చు. ఇలా, చైతన్యం ఒక రూపం నుంచి మరో రూపానికి మారుతుంది. కాబట్టి ఈ ప్రపంచంలోని ప్రతి రూపమూ మనవారే అనుకోవాలి. ఎవరు ఏ రూపంలో వున్నారో తెలియదు.కాబట్టి అందరినీ గౌరవించాలి. అందరినీ ప్రేమించాలి. ప్రతి జీవి ఈ చైతన్య స్వరూపమే కాబట్టి ప్రతి జీవినీ గౌరవించాలి. ప్రతి జీవినీ ప్రేమించాలి. కణం కణంలో భగవంతుడిని చూడటం అంటే ఇదే. భగవంతుడే చైతన్యం. కాబట్టి ఈ రూపంలో కనపడకుండా పోయిన చైతన్యం ఏదో మరో రూపంలోకి మారిపోతుంది. ఈ భావన అశాశ్వతుడనుకున్ని జీవికి శాశ్వతత్వాన్ని ఆపాదిస్తుంది. మనసుకు సాంత్వననిస్తుంది. జీవితాన్ని అర్థవంతం చేయటమేకాదు, జీవించటానికి ప్రేరణనిస్తుంది. ఆనందంగా, ఎలాంటి బాధలు, భయాలు లేకుండా జీవించే ఆలోచననిస్తుంది. అందుకే చివరలో అహ్మును, మమకారమావలనెట్టి మోహమ్ము వీడి ప్రబుద్ధుడవగుమా..అన్నాడు....ప్రబుద్ధుడవటం అంటే విజ్ఞానవంతుడవటం. నిత్యం ఒకరూపమ్మునుంచి మరో రూపానికి మారితూండే చైతన్య స్వరూపాన్ని గ్రహించటం.

ఇక విషాదం ఏముంది? నిరాశ ఏముంది? విజ్ఞానం ఆనందం. ఎలాంటి సందేహం లేదు. ఎలాంటి మోహం లేదు. అహం లేదు. జీవితం ఏమిస్తే దాన్ని భగవత్ ప్రసాదంగా స్వీకరించటం, సంతోషంగా, ఆనందంగా జీవించి వీలయినంతలో హాయిగా బ్రతకటమే ఈ ప్రయాణపు అర్థం.

**ఎక్ దిన్ బిక్ జాయేగా మాటీకే మోల్**

**జగమే రహెజాయేంగే ప్యారే తేరే బోల్**

**దూజేకే హోఠోంకో దేకర్ అప్నా గీత్**

**కోయీ నిషానీ ఛోడ్ ఫిర్ దునియా సే దౌడ్.**

ప్రతి ఒక్కరికీ తెలుసు ఏదో ఒకరోజు అన్నీ వదిలి పెట్టిపోవాలని. మనం పోయిన తరువాత మన జ్ఞాపకాలే మిగులుతాయని తెలుసు. కాబట్టి ఉన్నంతలో అందమైన జ్ఞాపకాలు మనగుర్తుగా మిగిల్చి, పిలుపు వచ్చినప్పుడు పరుగెత్తటమే. కొందరు ముందు, కొందరు వెనక. కొందరు త్వరగా, కొందరు ఆలస్యంగా. అంతే... కానీ, అందరూ వెళ్ళక తప్పదు.

**దునియా ఏక్ అజాయబ్ ఖానా, లేకిన్ ఫిర్ భీ ఫానీ**

ఇదొక ప్రేమ గీతం. అస్లీ నక్లీ సినిమాలో రఫీ స్వరంలో శంకర్ జైకిషన్ స్వరబద్ధంచేసిన హస్రత్ జైపురి గీతం. ఈ ప్రపంచం ఒక వింతల ప్రదర్శనల శాల లాంటిది. కానీ అంతా మోసం. క్షణంలో మాయమైపోతుంది. అలాంటి ప్రపంచంలో దేనిపైన మోహం? దేనికోసం దుఖం ?

**పల్ దో పల్ కా సాథ్ హమారా**
**పల్ దో పల్ కా యారానే హై**
**ఇస్ మంజిల్ పర్ ఇల్నేవాలే**
**ఉస్ మంజిల్ పర్ ఖోజానే హై**

మన స్నేహము, సంబంధము కొద్ది క్షణాలదే. ఈరోజు కలసినవారు రేపు విడిపోవాల్సినవారే. ఇది చేదు జీవిత సత్యం. దీన్ని అర్ధంచేసుకోవాలి....దీన్లో ఎలాంటి చాయిస్ లేదు. మన జీవితం క్షణకాలమే. మన స్నేహాలు, బంధుత్వాలు క్షణకాలమే. క్షణంలోగా రూపు మారిపోతుంది. అప్పుడూ క్షణకాలమే. ఈ క్షణాలు ఇలా వస్తూంటాయి. పోతూంటాయి. రూపు మారుతుంది. పేరు మారుతుంది. కానీ అనంత చైతన్యం అలా ప్రహిస్తూనే ఉంటుంది. అలా ప్రవహిస్తూ, ఏదో ఓ రోజు తీరానికి ఆ వైపున ఉన్న ప్రియుడిలో కలిసిపోతుంది.

**యే జీవన్ హై ఇస్ జీవన్ కా**
**యహీ హై యహీ హై రంగ్ రూప్**
**థోడే గం హై, టోఢీ ఖుషియా**
**యహీ హై యహీహై ఛావ్ ధూప్!**

ఇదే జీవితం. ఇదే దీని రంగు. ఇదే దీని రూపు. కాస్త సంతోషం, కాస్త విషాదం. ఇదే ఈ జీవితం....

## వచ్చే నెల మరిన్ని మధుర గీతాలతో